

ప్రజల మనిషి షడ్రక్

- జిల్లా వ్యాప్తంగా షడ్రక్ 5వ వర్ధంతి కార్యక్రమాలు
- కర్నూలు, ఉల్లాలలో ఉచిత వైద్య శిబిరాలు



ఆదోనిలో టి.షడ్రక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎంఎ.గఫూర్, గౌస్‌దేశాయ్ తదితరులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.షడ్రక్ నాలుగో వర్ధంతి సభను ఆదివారం కర్నూలు జిల్లాలో పలుచోట్ల నిర్వహించారు. ఆదోనిలో ఆయన చిత్రపటానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి తదితరులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ ఆయన కార్మిక, సామాజిక ఉద్యమాలను నిర్మించిన తీరును, పోరాట పటిమను స్మరించకున్నారు. అయన అడుగుజాలో పయణిస్తామని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతామని అన్నారు.

కర్నూలు, ఉల్చాలలో షడ్రక్ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. కర్నూలులో మైత్రి హాస్పిటల్, భరత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఉల్చాల గ్రామంలో ఎపిరైతు సంఘం, డివైఎఫ్ఐ జిల్లా కమిటీలు అమీలియో హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సిపిఎం జిల్లా కర్నూలు కార్యాలయం సుందరయ్య భవన్‌లో న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన టి. షడ్రక్ 4వ వర్ధంతి సభ నిర్వహించారు. మొదట షడ్రక్ చిత్రపటానికి ఆయన సతీమణి టి.అన్నపూర్ణ, పి.నిర్మల, సిపిఎం తదితరులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పి.నిర్మల మాట్లాడుతూ చాగలమర్రి మండలం పెద్ద బోధనంలో పేద కుటుంబంలో జన్మించిన షడ్రక్ 1974లో ఐటిఐ పూర్తి చేసుకొని కర్నూలు పేపర్ మిల్లులో ఉద్యోగంలో చేరి అక్కడ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియును ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. పేపర్ మిల్లులో సిఐటియు నిర్మాణం చేయటాన్ని ఓర్వలేక అక్కడ అసాంఘిక శక్తులు ఆయనను ఉద్యోగం నుండి తీసేయించాయని తెలిపారు. అప్పుడు ఉద్యోగం ముఖ్యమా, కార్మిక హక్కులు ముఖ్యమా అంటే కార్మికుల సమస్యల కోసం పోరాటమే ముఖ్యమని ఉద్యోగాన్ని వదిలేసి పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా వచ్చారని తెలిపారు. కర్నూలు పట్టణంలోనూ, జిల్లాలోనూ సిపిఎం ఉద్యమ నిర్మాణంలో టి.నరసింహయ్య, ఎంఎ. గఫూర్‌తో కలసి టి.షడ్రక్ కృషి చేశారని తెలిపారు. ఏదైనా కార్మికుల సమస్యలు ప్రజల సమస్యలు ఎక్కడ ఉన్నా వెంటనే స్పందించి ధైర్యంగా వెళ్లి రౌడీలకు సైతం సవాల్ చేసే విధంగా పనిచేసిన ఘనత షడ్రక్ దని అన్నారు. ప్రధానంగా పేపర్ మిల్ కార్మిక ఉద్యమం, మెడికల్ కాలేజీ, ఎస్ఎఫ్ఐ ఉద్యమం, మోటార్ వర్కర్స్ నీ కేంద్రంగా చేసుకొని జిల్లాలో సిపిఎం పార్టీని నిర్మించడంలో కృషి చేశారని తెలిపారు. ఆ తర్వాత కాలంలో కార్బైడ్ ఫ్యాక్టరీ, రైస్ మిల్లులు, గ్లాస్ ఫ్యాక్టరీలలో కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. షడ్రక్ కృషివల్లే కర్నూలులో రెండుసార్లు సిపిఎం ఎమ్మెల్యేగా ఎన్నుకోవడానికి ఉపయోగపడిందని తెలిపారు. చివరి క్షణం వరకు రాజీ పడకుండా ప్రజల సమస్యల కోసం కషి చేశారన్నారు. షడ్రక్ బాటలో ఆయన కుమారుడు డాక్టర్ వినోద్ పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైద్య సేవలు చేయడం అభినందనీయమని తెలిపారు. కరోనా మహమ్మారిని చూసి సొంత మనుసులే దగ్గరికి రావడానికి భయపడుతున్న రోజుల్లో కూడా తల్లిదండ్రులతోపాటు కరోనా పేషెంట్లను కాపాడడంలో ఐసోలేషన్ సెంటర్ నిర్మాణంలో డాక్టర్ వినోద్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. అందరూ షడ్రక్‌ను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, ఐద్వా జిల్లా అధ్యక్షులు కె. అరుణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సియచ్.సాయిబాబా తదితరులు మాట్లాడారు. **కోడుమూరు రూరల్ :** కర్నూలు జిల్లా ఉద్యమ నాయకులు షడ్రక్ నాలుగో వర్ధంతి కోడుమూరు మండల కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్ లో నిర్వహించారు. ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ సుభాన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ మార్పుకోసం కోసం త్యాగం చేసిన టి. షడ్రక్ లాంటి వారిని గుర్తుచేసుకోవడం మన బాధ్యత అన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై బడుగు బలహీన వర్గాల, రైతులు, కార్మికులు, పేదలు బాగుండాలని, వారి హక్కుల కోసం పోరాటం చేసిన మహా వ్యక్తి షడ్రక్ అని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి గఫూర్‌మియా, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాజు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మన్న, సిఐటియు మండల కార్యదర్శి జి పి వీరన్న ,, నాయకులు బి రాజు,వెంకటేశు,నాగరాజు, రాముడు, మధుబాబు, తదితర కార్మికులు పాల్గొన్నారు. **ఆస్పరి:** టి.షడ్రక్ ప్రజా సేవకుడని ప్రజలకు అందించిన సేవలు మరచి పోలేమని సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు బాలకృష్ణ అన్నారు. షడ్రక్ 4 వ వర్ధంతి సందర్భంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆస్పరిలోని సుందరయ్య భవనంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. సిపిఎం మండల నాయకులు రంగస్వామి, రామాంజనేయులు, చిన్న ఈరన్న, రవి, ఫ్రాన్సిస్, ఆటో యూనియన్ నాయకులు బలరాం,అబ్దుల్ పాల్గొన్నారు. **పత్తికొండ:** ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి, టి.షడ్రక్ ఆశయాలను కోసం పని చేద్దామని సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్ అన్నారు. వీరశేఖర్, రంగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవనంలో ఈశ్వర్ రెడ్డి 43వ వర్ధంతి, షడ్రక్ నాలుగో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈశ్వర్ రెడ్డి, షడ్రక్ ప్రజల కోసం పరితపించే వారిని అన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం , ఆశయాల కోసం ప్రతి ఒక్కరు వారు అడుగుజాడల్లో నడవాలని అన్నారు.



టి.షడ్రక్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న షడ్రక్ సతీమణి అన్నపూర్ణ, ఎండి.ఆనంద్‌బాబు తదితరులు



సుందరయ్య భవన్‌లో షడ్రక్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల



పత్తికొండలో ఈశ్వర్ రెడ్డి, టి.షడ్రక్ వర్ధంతి సభలో నివాళ్లు అర్పిస్తున్న నాయకులు వీరశేఖర్, రంగారెడ్డి తదితరులు



కోడుమూరులో టి.షడ్రక్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ.సుభాన్, సిపిఎం నాయకులు గఫూర్ మియా

నాణ్యమైన రోడ్లే ప్రధాన లక్ష్యం

- పటిష్టంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం
- ప్రజాశక్తితో ఆర్ అండ్ బి ఎస్ఈ నాగరాజు ముఖాముఖి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నాణ్యమైన రోడ్లే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ ఆర్.నాగరాజు పేర్కొన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణంలోనూ పటిష్ట నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నమని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆర్ అండ్ బి శాఖ ద్వారా చేపట్టిన పలు పనుల గురించి ప్రజాశక్తితో ఆయన ముఖాముఖి మాట్లాడారు.



2023-24 సంవత్సరంలో భవనాల నిర్మాణానికి నిధులు ఎన్ని మంజూరు అయ్యాయి..?

ఎస్ఈ : నంద్యాల జిల్లాలో కలెక్టరేట్ భవన నిర్మాణానికి ఇంటిగ్రేటెడ్ నిధులు రూ. 98.55 కోట్లు మంజూరు అయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పని నిలిచిపోయింది. అందుకు సంబంధించి టెండర్ పిలవాల్సి ఉంది.

సెంట్రల్ రిలీఫ్ ఫండ్ కింద ఎన్ని లక్షల నిధులు వచ్చాయి..?

ఎస్ఈ : కర్నూల్ డివిజనుకు రూ.37.50 కోట్లు, నంద్యాల డివిజన్‌కు రూ.161.50 కోట్లు, 8 పనులకు మొత్తం రూ.199 కోట్లు అంచనాల కాగా అందులో 5 పనులు పూర్తి చేసి రూ.95.83 కోట్లు ఖర్చు చేశాం.

గ్రామీణ రోడ్లకు ఏ డివిజన్లో ఎంత ఖర్చు చేశారు..?

ఎస్ఈ : గ్రామీణ రోడ్లకు ఆదోని డివిజన్లో రూ.13.6 కోట్లు ఖర్చు చేశాం.

రైల్వే ఓవర్ బ్రిడ్జి కోఆర్డినేట్ కింద ఎంత ఖర్చు చేశారు..?

ఎస్ఈ : రైల్వే ఓవర్ బ్రిడ్జి కోఆర్డినేట్ కింద కర్నూలు డివిజన్లో రూ.28.80 కోట్లు, నంద్యాల డివిజన్లో రెండు పనులకు రూ.49.72 కోట్లు ఖర్చు అయ్యాయి. కర్నూల్ డివిజన్లో రెండు పనులు గాను రూ.35 కోట్లు, ఆదోని డివిజన్లో రెండు పనులకు రూ.57.50 కోట్లు, నంద్యాల డివిజన్లో ఏడు పనులకు రూ.68.31 కోట్లు మొత్తం 11 పనులకు ఖర్చు చేశాం. అందులో కర్నూలులో రూ.13.13 కోట్లతో ఒక పని, నంద్యాలలో రూ.40.77 కోట్లతో ఒక పని పూర్తి చేశాం. కోర్నెట్ ప్రణాళికేతర పనులు కర్నూలు, నంద్యాలలో ఐదు పనులకు రూ.73.9 కోట్లు కాగా రూ.5.10 కోట్లు ఖర్చు చేసి నాలుగు పనులు పూర్తి చేసాం.

మేజర్ జిల్లా రహదారులకు ప్రణాళికేతర పనులు ఎన్ని చేశారు..? ఎంత ఖర్చు చేశారు..?

ఎస్ఈ : మేజర్ జిల్లా రహదారులకు ప్రణాళికేతర పనులు కర్నూలు, నంద్యాల డివిజన్లో ఏడు పనులు పూర్తి చేసి రూ. 476.79 లక్షలు ఖర్చు చేశాం.

న్యాయశాఖ కోర్టు భవనాలకు ఏ డివిజన్లో ఎంత ఖర్చు చేశారు..?

ఎస్ఈ : న్యాయశాఖ కోర్టు భవనాలకు ఆదోని డివిజన్లో 163 లక్షల పనులు మాత్రమే పూర్తి చేశాం.

ఎస్‌డిబి ఫేస్ -1 పనులు ఎన్ని చేశారు..? ఎంత ఖర్చు చేశారు..?

ఎస్ఈ : ఎస్‌డిబి ఫేస్-1 ఆదోని, నంద్యాలలో 12 పనులకు 30,964 లక్షలు అంచనాలు తయారు చేశాం .నంద్యాలలో మాత్రమే 680.25 లక్షల పనులు పూర్తి చేశాం.

మరమ్మతుల కోసం ఎండిఆర్ నిధులు కింద ఎంత ఖర్చు చేశారు..?

ఎస్ఈ : మరమ్మతుల కోసం బ్యాంకులోని ఎండిఆర్ నిధుల కింద 45 పనులు రూ.6,388 లక్షల అంచనాలతో పనులు ప్రారంభించి రూ.6811.70 లక్షలు ఖర్చు చేశాం. పిరియాడిక్ మెయింటెనెన్స్ బ్యాంకులను ఎస్‌హెచ్ నిధుల కింద 23 పనులకు రూ.6,476 లక్షల అంచనాలతో ప్రారంభించి 23 పనులు పూర్తిచేసి రూ.6685.97 లక్షలు ఖర్చు చేశాం. కోర్‌నెట్ నీడ్ కింద ఒక పని రూ.376 లక్షల అంచనా వ్యయంతో ప్రారంభించి పూర్తి చేశాం. ఎన్టీఆర్ ఎస్‌హెచ్ ప్లాన్ గాజులదిన్నె హై లెవెల్ బ్రిడ్జి అంతరాష్ట్ర రహదారుల ప్రణాళిక పనుల కింద ఒక పనిని రూ.39 లక్షల వ్యయంతో పని పూర్తి చేశాం.

కొత్తగా ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఎన్ని నిర్మించారు ఎంత ఖర్చు చేశారు?

ఏస్ఈ : ప్రైమరీ హెల్త్ సెంటర్స్ 9 పనులకు రూ. 1648.75 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించి రూ. 731.12 లక్షల పనులు పూర్తి చేశాం.

2023- 24 సంవత్సరానికి గాను కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు ఎంత పెండింగ్లో ఉన్నాయి?

ఎస్ఈ : కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 2023-24 సంవత్సరంలో రోడ్లు వేసి రూ.11,135 కోట్ల బిల్లుల పెండింగ్ లో ఉన్నాయి. భవన నిర్మాణాలలో ప్రధానంగా రాయలసీమ యూనివర్సిటీ, జ్యుడీషియల్ రెవెన్యూ వర్క్స్, కలెక్టర్ ఆఫీస్ 9 పనులు, పీహెచ్సీ లకు సంబంధించిన, చిన్న బిల్లులు కలుపుకొని పెండింగ్ లో ఉన్న బిల్లులు 2.52 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్లో ఉన్న బిల్లులు ప్రభుత్వం వెంటనే మంజూరు చేసి ఇచ్చినట్లయితే కొత్త పనులు చేయడానికి వీలుగా ఉంటుందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.



జిల్లా విలు విద్య నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

స్థానిక టిజివి కళాక్షేత్రంలో ఆదివారం కర్నూలు జిల్లా ఆర్చరీ నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విలువిద్య అసోసియేషన్ నుండి శివకుమార్, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రతినిధిగా నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర, అబ్జర్వర్‌గా అట్లాటిక్స్ కోచ్ కాశీ రావు పాల్గొన్నారు. సమావేశంలో సెక్రటరీ నాగరత్న మయ్య మాట్లాడుతూ విలువిద్యని జిల్లాలో చాలా ఏళ్లగా అభివృద్ధి చేస్తున్నామని, కర్నూలు నుండి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి, పోటీలలో పతకాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని అన్నారు. అనంతరం కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విలువిద్య కార్యవర్గ చీఫ్ పాటర్న్‌గా డాక్టర్ బిఎస్. ప్రవీణ్ కుమార్, పాటర్న్ గా డాక్టర్ సి.వాసు రెడ్డి, అధ్యక్షుడిగా సునీల్ కుమార్, సెక్రెటరీగా కె.నాగరత్నమయ్య, ట్రెజరర్‌గా మురళీమోహన్, వైస్ ప్రెసిడెంట్ గా విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీలుగా వంశీకృష్ణ, భరత్, శ్యామ్, లీగల్ అడ్వైజర్‌గా అడ్వకేట్ జ్యోతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా సందీప్, అనిల్, కిరణ్, శ్రీనివాస్ రెడ్డి, బాలాజీ రెడ్డి, రాజు, తదితరులు ఎన్నికయ్యారు.



పుట్టిన రోజున కేక్ కట్ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరువెంకట్‌రెడ్డి

ఘనంగా గౌరు చరిత జన్మదిన వేడుక

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నియోజకవర్గం లోని అన్ని మండలాలలో ఘనంగా నిర్వహించారు. టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు గౌరు అభిమానులు భారీ సంఖ్యలో తరలి వచ్చి వారి నివాసం మాధవి నగర్‌లో కేక్‌లు కట్ చేసి, పూల మొక్కలతో, గజ మాలలతో, శాలువాలతో గౌరు దంపతులను సత్కరించి పుస్తకాలు, పెన్నులు కానుకలు గా ఇస్తూ గౌరు చరిత రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గౌరు చరిత రెడ్డి జన్మదిన వేడుక సందర్భంగా కల్లూరు అర్బన్ 21వ వార్డ్ కిసాన్ నగర్ పార్కులో బ్లడ్ బ్యాంకు ఎర్పాటు చేశారు. కార్యక్రమంలో చరిత రెడ్డి యువ నాయకులు గౌరు జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని, దాదాపు 100 మంది నాయకులు కార్యకర్తలు అభిమానులు రక్తదానం చేశారు. పాత కల్లూరు చౌడేశ్వరి అమ్మవారిని చరిత రెడ్డి యువ నాయకుడు గౌరు జనార్ధన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓర్వకల్లు మండలం బొడ్డువాని పల్లే గ్రామం శ్రీ వీరాంజనేయ స్వామిని ఎమ్మెల్యే గౌరు చిరుత రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి నాయకులు చరిత రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పలు హాస్పిటల్ లలో , పలు అనాథ శరణాలయలలో పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేశారు.

పాడుబడ్డ బావిని పూడ్చండి

ప్రజాశక్తి - వెల్దుర్తి



వెల్దుర్తి మండల కేంద్రంలోని గుంటుపల్లి గ్రామంలో ఊరు మధ్యలో నివాస గృహాలకు అనుకొని పాత పాడుబడ్డ బావి ఉంది. అది చెత్తాచెదారాలు, పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో నిండి పాములు. విషపురుగులు, దోమలకు నిలయంగా మారి దుర్వాసన వస్తోందని విషజ్వరాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో వర్షపు నీరు బావిలోకి చేరడంతో ఎలాంటి రక్షణ కంచె లేకపోవడంతో పిల్లలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బావిలో పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బావిని పూడ్చాల్సిందిగా గ్రామస్తులు డిమాండ్ చేశారు.

వేధింపులు.. తొలగింపులు

- స్కీం వర్కర్లపై అధికార నేతల కక్షపూరిత వైఖరి - నేడు కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినా స్కీం వర్కర్లపై వేధింపులు, తొలగింపుల పర్వం ఆగడం లేదు. అధికారంలోకి వచ్చిన పార్టీ నేతలు తమ అనుయాయులకు ఉద్యోగాలు ఇవ్వడం కోసం ఉన్న వారిని తప్పకోవాలని బెదిరిస్తున్నారు. రాజకీయ అండదండలతో అధికార పార్టీ నాయకులు రెచ్చిపోతున్నారు. వీటిపై సిఐటియు ఆధ్వర్యంలో నేడు సోమవారం కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించనున్నారు.

కూటమి సర్కారు అధికారం చేపట్టి రెండు నెలలు గడవక ముందే స్కీమ్ వర్కర్లపై వేధింపులు మొదలయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో విధుల్లో చేరిన వారందరినీ టిడిపి, జనసేన నేతలు టార్గెట్ చేస్తూ పలువురిని అక్రమంగా తొలగిస్తున్నారు. విధుల నుంచి తప్పించి తీరాల్సిందేనంటూ అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నారు. తమ సొంత పార్టీ వారిని నియమించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అనేక మందిని అక్రమంగా తొలగించగా, మిగిలిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 8 వేల మంది అంగన్వాడీ కార్మికులు, 12 వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు. వారిని పొమ్మనకుండా పొగ పెట్టే ప్రయత్నాలు పలుచోట్ల సాగుతున్నాయి. ప్రస్తుతం పని చేస్తున్న వారిని తొలగించి, వారికి అనుకూలంగా ఉన్న వారిని నియ మించేందుకు రాజకీయ నాయకులు భారీగా సొమ్ములు కూడా దండుకుంటున్నట్లు ఆరోపణలు విని పిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే కూటమి కార్యకర్తలు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నా అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారు. ఈ వ్యవహారాలన్నీ ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేల దృష్టికి వెళు తున్నా వేధింపులకు పాల్పడుతున్న వారికే మద్దతుగా మాట్లాడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసిపి పాలనలో స్కీమ్ వర్కర్లపై ఇలానే వేధింపులు, రాజకీయ కక్ష సాధింపులు, అక్రమ తొలగింపులు జరిగాయి. దీంతో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులతో పాటు వివిధ ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లు సైతం కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి వైసిపికి తగిన గుణపాఠం చెప్పారు. రెండు నెలలు కూడా గడవక ముందే అధికార పార్టీకి చెందిన స్థానిక రాజకీయ నాయకులు అక్రమ తొలగింపులకు దిగుతున్నారు. ప్రధానంగా వెలుగు విఒఎలను ఇప్పటికే కొన్ని చోట్ల తొలగించారు. విధుల నుండి తప్పు కోవాల్సిందిగా ఇళ్లకు వెళ్లి బెదిరిస్తున్నారు. దీంతో ఇటీవల కలెక్టరేట్ వద్ద యానిమేటర్లంతా సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా కూటమి కార్యకర్తలు వేధింపులు ఆపలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టరేట్ల వద్ద స్కీమ్ వర్కర్లంతా కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నారు. అంగ న్వాడీ, ఆశ, యానిమేటర్లు, మధ్యాహ్న భోజన, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్మికులు ఆందోళనలో పాల్గొననున్నారు.

జీవితపుటల్లోంచి వచ్చిన కవిత్వమే'వెన్నెలకురవని రాత్రి'

పముఖకవి డాక్టర్ రాధేయ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

కవి జీవిత, జీవనపుటల్లోంచి వచ్చిన వాస్తవిక కవితాత్మక వాక్యమే వెన్నెలకురవని రాత్రి అని ప్రముఖకవి డాక్టర్ రాధేయ అన్నారు. సాహితీస్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షులు ఎంపి బసవరాజు అధ్యక్షతన ఆదివారం నగరంలోని పింగళిసూరన తెలుగుతోటలో కవయిత్రి స్వయంప్రభ కవిత్వీకరించిన వెన్నెల కురవనిరాత్రి కవిత్వ సంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభను జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణియాదవ్ ప్రారంభించారు. ఆవిష్కర్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కవిత్వంలోని కవితావాక్యాలు సగటు వర్తమాన మహిళ సంక్లిష్టత, సందిగ్ధతకు అద్దం పడుతుందన్నారు. ప్రతిమనిషి జీవితంలో చీకట్లు వెలుతురులు, వెన్నెలలు ఉంటాయని అవి కవిత్వమై కళ్ళముందు కదలాడే దశ్యాలవ్వడం అరుదైన విషయమన్నారు. పుస్తకాన్ని రాయలసీమ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు అరుణ మాట్లాడుతూ కవిత్వం తీరనిదాహమన్నట్లు ఈ కవిత్వం చదివేకొలది అటువంటి భావనే కలుగుతుందన్నారు. జీవితాన్ని కవిత్వంగా మలచి కన్నీళ్ళతో ఈ వెన్నెల కురవని రాత్రి గొప్ప కవిత్వమైందన్నారు. విరసం రాష్ట్ర నాయకులు, ప్రసిద్దకవి పాణి మాట్లాడుతూ వెన్నెల ఉందంటే మనిషి జీవితంలో చీకటి ఉన్నట్టేనని, చీకటిని పారద్రోలే కవిత్వం ఈనాటి సమాజానికి అవసరమన్నారు. ఈ కవిత్వం ద్వారా కవిత్వం ప్రజాస్వామ్యీకరించ బడుతుందన్నారు. విమర్శకులు నాగేశ్వరాచారి మాట్లాడుతూ కవిత్వరూపం గొప్పగా సాగిందని సమస్యల్ని ఇతివృత్తాలుగా తీసుకోవడం సహేతుకమని భావిస్తున్నానన్నారు. రచయిత మారుతీ పౌరోహితం మాట్లాడుతూ కవిత్వం పదునుగా సాగిందని వర్తమాన సమాజంలో అవసరమైనదన్నారు. కవయిత్రి స్వయంప్రభ మాట్లాడుతూ సభలో పద్యకవి డి.పార్వతయ్య కవయిత్రిపై పద్యాలాపన చేసి జ్ఞాపికతో సన్మానించారు. సభలో కవులు కెంగార మోహన్ , డా.సురేష్‌బాబు, డాక్టర్ పేరం ఇందిరాదేవి, లక్ష్మీకందిమళ్ళ, డాక్టర్ హరికిషన్, శ్రీనివాసులు, రాజశేఖర్, వీరేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



వెన్నెలకురవని రాత్రి కవిత సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు




స్నేహితుల రోజు కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా పరిషత్ హైస్కూల్ 1989 బ్యాచ్ వసంతనగర్ ,గొందిపర్ల , కర్నూలు పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. దాదాపు 25 మంది 35 సంవత్సరాల తర్వాత పాఠశాలను సందర్శించారు. స్కూల్‌కు కావాల్సిన ఫర్నిచర్ మంచినీటి సౌకర్యం ఇంకా ఏఏ పరికరాలు కావాలో అక్కడ వారిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు కావాల్సిన పరికరాలు సమకూర్చడానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసారు. సేఫ్ లైన్ ఎలక్ట్రికల్ సేల్స్ మేనేజర్ మురళీకృష్ణ దుబాయ్ నుండి వచ్చారు. అడ్వైస్ మైక్రో డివైజర్ రెండు తెలుగు రాష్ట్రాల రీజనల్ అధికారి సిఎల్‌వి ప్రసాద్ రెడ్డి, రాధాకృష్ణ సీడ్స్ ఫైర్ స్కిల్ మేనేజర్ చిత్తూర్ నుండి వచ్చారు. ఎన్ఎస్‌జి కామాండెంట్ మాజీ తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత పర్సనల్ సెక్రెటరీ పాపారాయుడు, రాజమండ్రి నుండి ఆల్కలీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ శెట్టి, కర్ణాకర్ వెల్దుర్తి హై స్కూల్ పిఇటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చనిపోయిన ఐదుగురు పూర్వ విద్యార్థులకు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.



రవీంద్రభారతిలో అవధానం చేస్తున్న కర్నూలు బోరెల్లి హర్ష

రవీంద్రభారతిలో హర్ష అష్టావధానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

హైదరాబాదులోని రవీంద్ర భారతిలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఆశావాది ప్రకాష్ రావు 81వ జయంతి సందర్భంగా అష్టావధానం ఆదివారం నిర్వహించారు. అవదాన కళానిధి ఆముదాల మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలు నగరానికి చెందిన అవదాని డాక్టర్ బోరెల్లి హర్ష అష్టావధారంలో పాల్గొన్నారు. అనంతరం ఆశావాది సాహితీ కుంభ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాహితీ లోకంలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆయన సాహిత్యం నేటి సమాజాన్ని చైతన్యం చేసే విధంగా ఉందన్నారు. అలాంటి సాహితీవేత్తను స్మరణ చేసుకుంటూ ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల కుటుంబ సభ్యులను అభినందించారు. ఆముదాల మురళి మాట్లాడుతూ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు తెలుగు రాష్ట్రాలతోపాటు ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో అష్టావధానాలు చేసి పలువురిని అలరించారని తెలిపారు.

ఉరుకుందలో నేటి నుండి శ్రావణ మాస ఉత్సవాలు

ప్రజాశక్తి -కౌతాళం

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 5 నుండి సెప్టెంబర్ 3 వరకు నెలరోజుల పాటు అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. నెల రోజులు పాటు జరిగే ఉత్సవాలలో భక్తులు కొలిచేవారికి కొంగు బంగారంగా మొక్కులు తీర్చుకుంటారు. దక్షిణాది రాష్ట్రాల నుండి సుమారు 20 లక్షల కు పైగా సందర్శకులు పాల్గొంటారు. తుంగభద్ర దిగువలో భక్తులు పుణ్య స్థానాలు ఆచరించి స్వామివారికి ఇష్టమైన నైవేద్యాన్ని తడి గుడ్డలతోనే వండుతారు. కొంతమంది భక్తులు తమ తలనీలాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకుంటారు. దేవాలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను కల్పిస్తారు. పుణ్యక్షేత్రానికి భక్తులు చేరుకోవడానికి కర్ణాటకలోని బళ్లారి, సిరుగుప్ప, రాయచూర్, ఆంధ్ర లోని ఆదోని ఎమ్మిగనూరు డిపోల నుండి ప్రత్యేక బస్సులను నడిపిస్తారు. పుణ్యక్షేత్రంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండటానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో సిఐలు, ఎస్ఐలు, పోలీసులు, ఎన్‌సిసి సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహిస్తారు.

భక్తులకు మంచి సౌకర్యాలు కల్పిస్తాం



శ్రావణమాస ఉత్సవాలలో భక్తులకు మంచి సౌకర్యాలు కల్పిస్తామని డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ పేర్కొన్నారు. దేవాలయ డిప్యూటీ కమిషనర్ హెచ్‌డి. వెంకటేష్ సెలవు పై వెళ్లారు. శ్రావణమాస ఉత్సవాలకు ఫెస్టివల్ ఆఫీసర్గా నియమితులైన పట్టెం గురు ప్రసాద్ ఆదివారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.

కోట్లలో ఆదాయం.. కనీస సౌకర్యాలు కరువు.. పూర్తికాని ఏర్పాట్లు

శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రానికి భక్తుల ద్వారా కోట్లలో ఆదాయం సమకూరుతుంది. స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం అవుతున్నా ఏర్పాట్లు పూర్తి కాకపోవడం పట్ల భక్తులు విమర్శిస్తున్నారు.

తాగునీరు: స్వామి వారి దర్శనం కోసం లక్షలాదిమంది భక్తులు తరలి వస్తారు. భక్తుల కోసం శాశ్వతంగా నీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. కనీసం తాగడానికి తాగునీరు అందని పరిస్థితిలో పుణ్యక్షేత్రం ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఉత్సవాలలో తాగునీటి కోసం ప్రజలు కష్టాలు తప్పడం లేదు. డబ్బులు పెట్టి తాగడానికి నీరు కొనుగోలు చేయాల్సిందే.

మరుగుదొడ్ల సౌకర్యం లేదు: శ్రావణమాస ఉత్సవాలలో పాల్గొనే భక్తులకు మరుగుదొడ్ల సౌకర్యం అంతంతే ఉంది. 20 లక్షలకు పైగా వచ్చే భక్తుల కోసం కేవలం 35 మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 15 శాశ్వతంగా ఉండగా అదనంగా 20 తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇంతవరకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు పూర్తి కాకపోవడం విశేషం.



రక్షక భటులకు నీడ కరువు: శ్రావణమాస ఉత్సవాలు విజయవంతం కావాలంటే ముఖ్యమైన శాఖ లో ఒకటి పోలీసు శాఖ. అలాంటి శాఖకు ఇప్పటివరకు సౌకర్యాలు కల్పించలేదు. ఆదివారం ఒక చెట్టు కింద కూర్చుని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి కొనసాగుతుంది. రక్షక భటులకే పూర్తిగా సౌకర్యాలు ఇంకా ఏర్పాటు కాలేదంటే, ఇంకా భక్తుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాల్సిందే. ఇప్పటికైనా దేవదాయ శాఖ అధికారులు స్పందించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పీడితుల కోసం ప్రాణ త్యాగం చేసిన మహా నాయకుడు షద్రక్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పీడిత ప్రజల కోసం ప్రాణ త్యాగం చేసిన మహానాయకుడు టి.షద్రక్ అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నిర్మల, కెవి నారాయణలు తెలిపారు. ఆదివారం సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ టి.షద్రక్ 4వ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం మైత్రి హాస్పిటల్, భరత్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సూర్జిత్ భవన్లో నిర్వహించారు. ముందుగా సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన టి.షద్రక్ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. వహించారు. అనంతరం వైద్యులు భరత్, స్వాతి, అరుణ్, సాదియా, శశాంక్, హనీఫ్‌లు వైద్య సేవలు అందించారు. మెడికల్ రెప్స్ ఖలీల్, శంకర్, మైత్రి హాస్పిటల్ ఫార్మసి జనరల్ మేనేజర్ రమీజ, డైరెక్టర్ బద్రిలు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ ప్రసాద్ శర్మ, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.ఎం.డి షరీఫ్, ఎం .విజయ్, కె.రామకృష్ణ, అబ్దుల్ దేశాయ్, నగర కమిటీ సభ్యులు మాభాష, కాజా బాషా, మైముద్ తదితరులు ఫాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్వాతి



వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న నిర్మల

కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో : కర్నూలు నగరంలోని బుధవారపేటలో ఉన్న కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో షద్రక్ 4వ వర్ధంతి కార్యక్రమాన్నిఓల్డ్ సిటి కార్యదర్శి అంద్రా గురుస్వామి అధ్యక్షతన నిర్వహించారు. షద్రక్ చిత్ర పటానికి కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి ఆనంద్ బాబు నివాళులు అర్పించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ జి కృష్ణ, న్యూ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏసురాజు, భాస్కర్ మాట్లాడారు. కెవిపిఎస్ మహిళా నాయకులు విజయమ్మ, జయమ్మ, లక్ష్మినారాయణ, ప్రదీప్, చింటూతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

షద్రక్ ఆశయాలను కొనసాగిస్తాం సిపిఎం

టి షద్రక్ నాలుగవ వర్ధంతి సందర్భంగా ముజఫర్ నగర్ లో టిసి లక్ష్మమ్మ కుట్టు సెంటర్ నందు టి షద్రక్ చిత్రపటానికి సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప సిపిఎం సీనియర్ నాయకులు కె ఇసాక్, యంసి ఆనంద్, ఎస్.ఓబులమ్మ, కె దానమ్మ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంసి ఆనంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప మాట్లాడుతూ ఆంధ్రా గ్లాస్ ఫ్యాక్టరీ కార్మికులకు యూనియన్ నాయకుడు గా అండగా ఉండి ఇళ్ల స్థలాలు లేని అన్ని రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ముజఫర్ నగర్ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కృషి చేశారని తెలిపారు. సిపిఎం నాయకులు ఎం పి ఆనందు సురేష్ శ్రావణ్ కుమార్ ఆంజనేయులు మనోహర్ బషీర్ అహ్మద్ మాదన్న బీషన్న వెంకటేశ్ దావీదు మహిళా సంఘం నాయకులు ఓబులమ్మ దానమ్మ రమణమ్మ పాల్గొన్నారు.

ఎర్రగుడి ఈశ్వర రెడ్డి, షద్రక్ వర్ధంతి

దేవనకొండ : పత్తికొండ మాజీ ఎమ్మెల్యే అమరజీవి, పేదలకు భూ పంపిణీ చేసి దళితుల గిరిజనలు ఆత్మగౌరవాన్ని నింపిన మహోన్నత నేత ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి 45 వర్ధంతి , సిపిఎం జిల్లా కార్యదర్శి షద్రక్ నాలుగో వర్ధంతి సందర్భంగా తెర్నేకల్ గ్రామంలో సిపిఎం కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. పార్టీ శాఖ కార్యదర్శి మహబూబ్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అపార్టీ సీనియర్ నాయకులు పరమేష్, బజారి, గాజుల శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు శ్రీరాములు మాట్లాడారు.



ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ వినోద్

బిజెపి ప్రభుత్వ విధానాలు దేశానికి ప్రమాదకరం

సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్

ప్రజాశక్తి-ఆదోని

మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వ మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలు దేశానికి ప్రమాదకరమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ అన్నారు. ఆదివారం ఆదోనిలోని భవసార కళ్యాణ మండపంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో అతి కష్టం మీద మిత్రుల సహకారంతో అధికారంలో కొనసాగుతున్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు లాభం చేకూర్చే పద్ధతిలో ఈ మధ్యనే బడ్జెట్ ను ప్రవేశ పెట్టిందన్నారు. బడ్జెట్లో కార్మికులు కర్షకులు, రైతాంగానికి, మధ్యతరగతి, సామాన్య, ప్రజానీకానికి ఏ విధమైన ప్రయోజనం లేదని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన చట్టంలో హామీలు ఏవి అమలు చేయకుండా రాజధానికి మాత్రమే 15 వేల కోట్లు అప్పుగా ఇవ్వడం అన్యాయమని అన్నారు. వెనకబడిన రాయల సీమకు ప్రత్యేక ప్యాకేజీ, ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వం కూడా ఆదోని ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టా లన్నారు. ప్రధానంగా వలసలు నివారణ, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం గురించి ఎక్కడ ప్రస్తావన చేయడం లేదని విమర్శించారు.



ఆదోని కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్

బిజెపి ప్రభుత్వ మతతత్వ విధానాల్ని వ్యతిరేకిస్తూ, ఆదోని ప్రాంత అభివృద్ధి కోసం సిపిఎం పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, బి.రామాంజనేయులు, సిపిఎం పట్టణ మండల కార్యదర్శి లక్ష్మన్న, లింగన్న, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు గోపాల్ రెడ్డి, కృష్ణమూర్తి, మల్లేష్, వెంకన్న, నాయకులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, వీరారెడ్డి తిక్కప్ప రామాంజ నేయులు,ఉచ్చిరప్ప,కార్యకర్తలు, సానుభూతిపరులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తుంగభద్ర దిగువ కాల్వకు పూర్తి స్థాయిలో నీళ్లివ్వాలి

- తెలుగు రైతు సంఘం అధికార ప్రతినిధి సాయిబాబా

ప్రజాశక్తి-ఆదోని

హోస్పేట్ డ్యాం నుంచి తుంగభద్ర దిగువ కాలువకు రావాల్సిన వాటానీరు అందించి రైతుల వలసలను నివారించాలని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా కోరారు. విజయవాడలో శనివారం సిఎం చంద్రబాబునాయుడుతో కలిసి ప్రత్యేకంగా విన్నవించినట్లు తెలిపారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంత నియోజకవర్గలు అధిక భాగము వర్షాధార భూములే ఉన్నాయని తెలిపారు. నీటి పారుదల సౌకర్యం తక్కువగా ఉందని, పంటలు లేక పంటలు పండక రైతులు మహానగరాలకు వలసలు వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్ర డ్యాం నుండి ఆంధ్రప్రదేశ్ వాటాగా 734 క్యూసెక్కుల నీరు రావాల్సివుండగా ఎల్ఎల్‌సి ద్వారా కేవలం 250 క్యూసెక్కులు నీరు మాత్రమే వస్తున్నాయన్నారు. సుమారు 200 టిఎంసిలు వధాగా సముద్రంలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నీటిని వాడుకోవడానికి గుంతకల్ – బళ్ళారి రహదారిలో హగరి వద్ద ఒక ప్రాజెక్టు నిర్మించి గ్రావిటీ ద్వారా వేదవతి ప్రాజెక్టుకు అనుసంధానం చేసి 60 టిఎంసిల నీటిని కర్నూలు జిల్లాకు కేటాయిస్తే సుమారు ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని అన్నారు. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో రిజర్వాయర్లు నిర్మిస్తే కర్నూలు జిల్లా మొత్తం నీటి సౌకర్యము ఏర్పడుతుందని తెలిపారు. ఎల్ఎల్‌సికి కర్ణాటక రాష్ట్రంలోని సిరిగిరి గ్రామం 50వ కిలోమీటర్ వద్ద నుండి ఎల్ఎల్ సి ఏపి సరిహద్దులో 251 కి.మి. హానవాల్ గ్రామం వరకు అండర్ గ్రౌండ్ పైపు లైన్ నిర్మించి ఎల్ఎల్‌సికి అనుసంధానం చేయాలని కోరారు. కౌతాళం మండలం మేళిగనూరు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ తుంగభద్ర నదిపై నిర్మిస్తే సుమారు 2 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి ఏర్పడుతుందన్నారు. ఆర్‌డిఎస్ వద్ద 4 టిఎంసిల నీటి కొరకు నిర్మిస్తున్న ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికపై పూర్తి చేయాలని, వేదవతి ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించాలని కోరారు. తుంగభద్ర నది తీరా మండలాలైన కౌతాళం నుండి సి.బెళగల్లు వరకు తుంగభద్ర నదిపై 11లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు సామర్థ్యాన్ని పెంచి అదనంగా నీటి సౌకర్యం కల్పించాలని, రాష్ట్రంలో ఒక్క కర్నూలు పార్లమెంటుకు అనగా 7 నియోజకవర్గాలకు 150 టిఎంసి నీరు అవసరముండగా కేవలం 10 టిఎంసి నీరు మాత్రమే అందుతున్నాయన్నారు. దీనివల్ల జిల్లా రైతులు వ్యవసాయరంగంలో అధికంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు . సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.



సీఎంకు వినతిపత్రం ఇచ్చి సమస్యలు వివరిస్తున్న సాయిబాబా

నిరుపయోగంగా ఫిల్టర్ వాటర్ మిషన్

- పాఠశాలలో తాగు నీరు కరువు - ఇంటి నుంచి తెచ్చుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ పాఠశాలల రూప రేఖలు మార్చాలనే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల నిధులు వెచ్చిస్తున్నా చిప్పగిరి మండలంలోని చాలా పాఠశాలల్లో కనీస వసతులకు నోచుకోవడం లేదు. చిప్పగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో పలు సమస్యలు తిష్ట వేశాయి. ప్రభుత్వం విద్యార్థులకు మంచినీటి వసతి కల్పించాలని ఉద్దేశంతో పాఠశాలలో శుద్ధ జల కేంద్రం ఏర్పాటు చేసి ఫిల్టర్ మిషన్ ఏర్పాటు చేయించారు. ఫిల్టర్ మిషన్ చెడిపోవడంతో వాటికి మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో అధికారులు ఉన్నారు. గత్యంతరం లేక విద్యార్థులు ఇంటి నుండి వాటర్ బాటిల్స్‌ను తెచ్చుకుంటున్నారు. పేరుకే మండల కేంద్రంలో పాఠశాల ఉంది కానీ ఇప్పటివరకు పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ లేదు. ముళ్ళ పొదల నుంచి ఏ విష సర్పాలు వచ్చినా దిక్కు లేదని విద్యార్థులు తెలుపుతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు పాఠశాలలో ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే కాంపౌండ్ వాల్‌ను, ఫిల్టర్ మిషన్‌కు మరమ్మత్తులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే గత ప్రభుత్వంలో అదనపు గదుల నిర్మాణంనకు నాబార్డు పథకం ద్వారా నిధులు మంజూరు చేసి పునాదులకు పరిమితం చేశారు. పునాదులకు పరిమితమైన గదులను మరల నిర్మాణాలు పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిరుపయోగకరంగా ఫిల్టర్ మిషన్



గుంతలమయంగా శిరుగుప్ప బైపాస్ రోడ్డు

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

పట్టణంలోని ఆలూరు–సిరుగుప్ప బైపాస్ రోడ్డు గుంతలమయంగా మారింది. బైపాస్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో తారు రోడ్డు దెబ్బతింది. భారీ గుంతలతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. బైపాస్ మీదుగా ఆలూరు, గుంతకల్, బళ్లారి, మాధవరం, రాయచూరు, సిరుగుప్ప వైపు భారీ వాహనాల్లో గ్రానైట్, ఇసుక, మట్టిని తరలిస్తారు. ఈ రోడ్డుకు శాశ్వతంగా మరమ్మతులు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షాలకే పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. పెద్ద గుంతల్లో పడి పలువురు ద్విచక్రవాహనదారులు గాయాలపాలవుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడకుండా పటిష్టంగా రోడ్డు వేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. బైపాస్ రోడ్డులో గుంతలు పూడ్చి చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్నేహితుల సంబరాలు

ప్రజాశక్తి-ఆదోని



ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదోనిలో ఆదివారం పలుచోట్ల స్నేహితులు సంబరాలు జరుపుకున్నారు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ మధురానుభూతులు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. మున్సిపల్‌రోడ్డు లోని దుకాణంలో సంబరాలు నిర్వహించుకుని ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప మాట్లాడారు. ఎలాంటి రక్తసంబంధం లేకున్నా ఆపదలో ఆదుకునే వాడు స్నేహితుడు ఒక్కడేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బుద్దారెడ్డి, ముజీబ్ హమ్మద్ ,లక్ష్మీనారాయణ ,గోన భావి గోపాల్ ,సుబ్బు ఉన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-ఆదోని

యుటిఎఫ్ ఏర్పడి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆదోనిలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను సీనియర్ ఉపాధ్యాయులు మల్లయ్య ప్రారంభించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాది లింగప్ప ఆడిట్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు మాట్లాడారు. డివిజన్, జిల్లా స్థాయి విజేతలకు దసరా సెలవుల్లో రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరులో జరుగుతాయన్నారు. ఉపాధ్యాయులు క్రీడా నైపుణ్యం ప్రదర్శించేందుకు ఇదో మంచి అవకాశమన్నారు. ఉపాధ్యాయులు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు బ్రేక్

- చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు - నిలిచిపోయిన పనులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు ప్రభుత్వం ఇంతవరకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేయించిన కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. 2014 నుండి 19 వరకు టిడిపి హయంలో చేసిన పనులకు జగన్ మోహన్ రెడ్డి సీఎం కాగానే బిల్లులు నిలిపివేశారని అప్పట్లోనే తీవ్రంగా నష్టపోయామని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. జగన్ ప్రభుత్వంలో చేసిన సిమెంట్ రోడ్లు కాలువలు ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలు రికార్డు చేసి ఆన్లైన్లో పొందుపరిచినా ఇంతవరకు పైసా కూడా జమ కావడం కాకపోవడంతో అప్పుల ఊబి కోరుకుపోక తప్పదని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు

నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం : ఆదోని పాత బస్టాండ్ మైదానంలో సుమారు రూ. 33 కోట్ల వ్యయమం తో ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు గ్రౌండ్ లెవెల్‌లో పనులు ప్రారంభమయ్యాయి. పనులు చురుగ్గా సాగుతున్న నేపథ్యంలో ఉన్నటువంటి బ్రేక్ పడడంతో ఇప్పట్లో పనులు మొదలయ్యే పరిస్థితి కనపడడం లేదని చెబుతున్నారు. దుకాణాల కోసం డిపాజిట్ చెల్లించిన వారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు మాత్రం సరైన సమాధానం చెప్పలేని పరిస్థితి ఉంది.

రూ. 10 కోట్ల వరకు బకాయిలు : ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని కాంట్రాక్టర్లకు సుమారుగా రూ. 10 కోట్ల వరకు బిల్లులు పెండింగ్లో ఉన్నట్లు చెబుతున్నారు. గత ప్రభుత్వ హాయంలో ప్రభుత్వం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి వార్డులలో రూ ఐదు నుంచి రూ. 20 లక్షలు వరకు కాంట్రాక్టర్లు సిసి రోడ్డు, డ్రైనేజీలు నిర్మించారు అదేవిధంగా ఫైనాన్స్ జనరల్ ఫండ్ కింద చేసిన పనులకు కూడా బిల్లులు రావడంలేదని వాపోతున్నారు. పనులకు సంబంధించిన వివరాలన్నీ రికార్డు చేసి సి ఎఫ్ ఎంఎస్ లో పొందుపరిచినట్లు మున్సిపల్ ఇంజనీరు వెంకట చలపతి రెడ్డి తెలిపారు



నిలిచిపోయిన పనులు

పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు : ఆదోని పట్టణంలో నిలిచిపోయిన పనులను నిర్వహించేందుకు కాంట్రాక్టర్లు విముఖత చూపుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే పార్థసారథి కాంట్రాక్టర్లతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయాలని బిల్లులు తాను మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినప్పటికీ కాంట్రాక్టర్‌లు మాత్రం మూకుమ్మడిగా ససేమీరా అన్నట్లు తెలుస్తోంది. రాంజల చెరువులో నుండి నీరు బయటకు పంపే పనులకు కాంట్రాక్టర్లను పిలిచినా ఎవరు రాకపోవడంతో చివరకు అధికారులే పనులు చేయించే ప్రయత్నం చేశారు.

చిన్నారిపై ఉన్న దెబ్బలతో సంబంధం లేదు

అంగన్వాడీ టీచర్ బి. శ్వేత

ప్రజాశక్తి మంత్రాలయం

అంగన్వాడీ సెంటర్‌లో చదువుతున్న చిన్నారి మనీషాపై ఉన్న దెబ్బలకు తనకు ఎలాంటి సంబంధం లేదని అంగన్వాడీ టీచర్ బి. శ్వేత తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉన్న 4వ నెంబర్ అంగన్వాడి సెంటర్‌లో శనివారం సాయంత్రం దెబ్బలు తగిలాయని చిన్నారి మనీషా చెప్పిన మాటలు విని తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, దెబ్బలపై స్పష్టమైన సమాచారం లేకపోవడంతో పోవడం వల్ల వారు ఫిర్యాదును వెనక్కు తీసుకున్నారని చెప్పారు. మనీషా ఒక్కోసారి ఒక్కొక్క మాట చెప్పడంతో పోలీసులు కూడా చిన్నారి మాటలు విన్నారని తెలిపారు. అయినా తాను మధ్యాహ్నం 12 గంటల వరకే ఉన్నానని, ఆ తర్వాత పిల్లల మధ్య తగాదా ఏర్పడి కొట్టుకొని ఉండవచ్చునని చెప్పారు. బయట ఏమి జరుగుతుందో తెలియదు కానీ అంగన్వాడీ కేంద్రంలో మాత్రం ఎలాంటివి జరగలేదని పేర్కొన్నారు. చిన్నారి మనీషాను కొట్టానని తనపై వచ్చిన ఆరోపణలో వాస్తవం లేదని తెలిపారు.

అన్వీక్షికి -2023 ఉగాది నవలల పోటీలో 'తోకలేని పిట్ట'

ప్రజాశక్తి -కర్నూల్ కల్చరల్



అన్వీక్షికి –2023నవలల పోటీలో కర్నూలుకు చెందిన రచయిత పుల్లా రామాంజ నేయులు రాసిన తోకలేనిపిట్ట నవల బహుమతి పొందింది. యంగ్ అడల్ట్ ఫిక్షన్ విభాగంలో రూ.5,000 బహుమతి పొందింది. ఆదివారం హైదరాబాద్ లోని ప్రసాద్ సినిమా రివ్యూ థియేటర్‌లో నవల తోకలేనిపిట్టకు ఉగాది నవల పోటీలో గెలు పొందినందుకు సినిమా దర్శకులు వంశి నటుడు, రచయిత, కవి డాక్టర్ తనికెళ్ళభరణి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.


స్నేహమంటే ఇదేరా

మృతిచెందిన మిత్రుడి కుటుంబానికి రూ. 50వేల ఆర్థిక సాయం అందించిన మిత్రులు

ప్రజాశక్తి-మంత్రాలయం: తమతో పాటు చదువుకున్న మిత్రుడు అకాల మరణంతో ఇబ్బందుల్లో ఉన్న మిత్రుడి కుటుంబానికి అండగా నిలచి స్నేహమంటే ఇదేరా అనిపించారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. మండల పరిధిలోని చిన్నతుంభళం గ్రామానికి చెందిన ఖాదర్ బాషా మార్చి నెలలో గుండె పోటుతో అకాల మరణం చేందాడు. అతనితో పాటు 2004–2005 సంవత్సరం లో పదవ తరగతి చదివిన మిత్రులు నరసింహులు, శ్రీక్రిష్ణ, సుధీర్, రాముడు, వీరేష్, వీరభద్ర, యూసఫ్, గోవర్ధనరెడ్డి, క్రిష్ణ రెడ్డి, మల్లయ్య, నజీర్‌లు కలసి మిత్రుడి కుటుంబానికి రూ. 50,000 ఆర్థిక సాయాన్ని గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు.

శ్రీ మఠంలో అష్టోత్తర పారాయణం

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో సామూహిక స్తోత్ర అష్టోత్తర పారాయణం చేశారు. ఆదివారం స్థానిక శ్రీ మఠంలోని ఊయల మంథపంలో సింహాసనంపై రాఘవేంద్రుని బృందావన ప్రతిమను ఉంచి పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో శ్రీ గురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం పండితులు, శిష్య బృందం విద్యార్థులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అందరికీ ఫల ముద్రాధారణతో ఫల మంత్రాక్షితలు అందజేసి ఆశీర్వదించారు



చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలి : వీరభద్ర గౌడ్

హొళగుంద: చివరి ఆయకట్టు వరకు నీరు అందించి పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని ఆలూరు టిడిపి ఇన్చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు.ఆదివారం ఎల్ఎల్‌సి కాలువ మీద పర్యటించారు. మండలం లోని బాపురం జే హోసలి,గూళ్యం అమృతాపురం, డిపిలను పరిశీలించారు. పంటలకు పిల్ల కాలువ ద్వారా నీరు అందడం లేదని రైతులు ఎస్‌టిఓకు తెలిపారు. ఈ సందర్భంగా ఆలూరు టిడిపి ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ రైతులతో మాట్లాడుతూ పంట చివరి వరకు నీరు విడుదల చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఓ అంజాద్ బాషా, ఈశ్వరయ్య, టిడిపి వినాయకుడు గిరి, మల్లేష్ గౌడ్, క్లస్టర్ ఇంచార్జ్ పాల్ రెడ్డి, అసుండి శ్రీధర్ పపాల్గొన్నారు.